సాక్షి ప్రకాశం

బుధవారం । 24 । జూన్ । 2026

ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రభుత్వమే నడపాలి

మార్కాపురం: ఆర్టీసీలో త్వరలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వమే సొంతంగా కొనుగోలు చేసి, సొంత సిబ్బందితో నిర్వహించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కాపురం ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు టంగుటూరి మల్లికార్జునరావు, విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తప్పుబట్టారు. స్త్రీ శక్తి పథకం విజయవంతం కావాలంటే మరో 4 వేల బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీలో వెంటనే 10 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ధర్నాలో జేఏసీ నాయకులు జనార్దనరావు, గోను శ్రీనివాసులు, బొగ్గు నాగిరెడ్డి, భాషాహుస్సేన్, కృష్ణమూర్తి, శేఖర్‌నాయుడు, రమణ కన్వీనర్, ఇఏ. శ్రీనివాసులు, కోకన్వీనర్లు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్టం	కనిష్టం
ఒంగోలు	36	28
మార్కాపురం	36	28
కనిగిరి	36	28

న్యూస్‌లీల్

రుణాలు ఇతోధికంగా మంజూరు చేయండి

- డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశాల్లో కలెక్టర్ రాజాబాబు

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన బ్యాంకు అధికారులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక అమలులో ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలు చేధించాలని, ఇతోధికంగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో మంగళవారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిగా కచ్చితంగా సాధించాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డ్వాక్రా సంఘాలకు, యువత స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయడంతో పాటు యూనిట్ల ఏర్పాట్లలో కూడా వారికి సాంకేతిక సహాయం అందించి త్వరితగతిన యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, నాబార్డు అధికారి రవికుమార్, ఆర్‌బీఐ ఏజీఎం కిషన్ కుమార్, డీఆర్‌డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, విజయలక్ష్మి, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావు, జిల్లా సెరికల్చర్ అధికారి డాక్టర్ సుజయ్, రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని అన్ని బ్యాంకుల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఒంగోలు నగరపాలక సంస్థలో అవినీతి కంపుకొడుతోంది. చెత్త సేకరణ పేరుతో భారీ ఎత్తున దందా జోరుగా సాగుతోంది. నగరంలోని వేలాది ఇళ్ల నుంచి ప్రైవేటు ఆటోల ద్వారా నెలనెలా డబ్బులు వసూలు చేస్తూ అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య విభాగంలోని కొందరు అధికారుల అండదండలతో జరుగుతున్న ఈ దందాలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్టు సమాచారం. చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామంటున్న అధికారులు, ఆ సంపదను కార్పొరేషన్ ఖజానాకు కాకుండా కొందరి జేబుల్లోకి మళ్లిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైవేటు ఆటోలు లేవు.. డబ్బులు వసూలు చేయటం లేదు...

ఒంగోలు నగరంలో ప్రైవేటు ఆటోల ద్వారా చెత్త సేకరించటం లేదు. గతంలో ఉండేవి, ప్రైవేటు ఆటోలపై కౌన్సిల్‌లో రచ్చ జరిగిన తరువాత వాళ్లను పంపించి వేశాం. నలుగురైదుగురు మాత్రం చెత్త సేకరించుకుంటున్నాం, డబ్బులు వసూలు చేయటం లేదని చెబుతున్నారు. వాళ్లు చిత్తు కాగితాలు ఏరుకునేవారు మాత్రమే. ప్రైవేటు ఆటోల ద్వారా చెత్త సేకరణకు డబ్బులు వసూలు చేయటం లేదు. డ్వాక్రా గ్రూపుల ట్రాక్టర్లు కొంతమంది సక్రమంగా చెత్త సేకరణకు రాకపోవటంతో వాళ్లను తొలగించి కొత్తవారిని తీసుకుంటున్నాం. త్వరలో నగరానికి ఎలక్ట్రికల్ ఆటోలు కూడా రానున్నాయి.

– పిచ్చయ్య, శానిటరీ విభాగం సూపర్‌వైజర్, ఒంగోలు

దోపిడీ చెత్తగించండి!

- ఒంగోలు నగరపాలక సంస్థలో చెత్త సేకరణ పేరుతో దోపిడీ
- చెత్త నుంచే సంపద కూడబెట్టుకుంటున్న అధికార యంత్రాంగం
- కొనసాగుతున్న సెలవుపై వెళ్లిన కమిషనర్ లాబీయింగ్
- కర్నూలు నుంచి తెచ్చిన 20 ప్రైవేటు ఆటోలతో యథేచ్ఛ వసూళ్లు
- ఒక్కో ఇంటి నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు
- రూ.18 లక్షల బకాయిలు చెల్లించకుండానే డ్వాక్రా ట్రాక్టర్ల సేవలకు బ్రేక్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఒంగోలు నగర పాలక సంస్థలో పరిధిలో సుమారు 87 వేల గృహాలు ఉన్నాయి. తడి, పొడి చెత్తతో పాటు ఇతర రకాల వ్యర్థాలు, మురుగు కాల్వల్లో నుంచి తీసే వ్యర్థాలు అయితేనేమి ప్రతి రోజూ 125 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువగానే చెత్త పోగవుతోంది. నగరంలో ప్రభుత్వం తరపున 50 ఆటోలు, 30 ట్రాక్టర్లు చెత్త సేకరిస్తున్నాయి. నగరంలోని 50 డివిజన్లు 5 శానిటరీ డివిజన్లుగా విభజించారు. డివిజన్లలో పర్మినెంట్ కార్మికులు 80 మంది ఉండగా, ఆప్కాస్ కింద 681 మంది కొనసాగుతున్నారు. వీరితోపాటు కోవిడ్ విధుల కింద మరో 160 మంది పనిచేస్తున్నారు. ప్రైవేటు ఆటోల ద్వారా ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి నెలవారీ వసూలు చేయటంపై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పారిశుధ్య విభాగంలో పనిచేస్తుంటే తమ చేత రోడ్లు ఊడ్పించటం, కాలువల్లో మురుగు తీయించటంలాంటి పనులు చేయిస్తున్నారని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సెలవుపై వెళ్లిన కమిషనర్ లాబీయింగ్...

నగర పాలక సంస్థలో కమిషనర్‌గా పనిచేసి దీర్ఘకాలిక సెలవులో వెళ్లినా ఆయన కనుసన్నల్లోనే చెత్త దందా కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన హయాంలో కర్నూలు నుంచి 20కి పైగా ప్రైవేటు ఆటోలను తీసుకొచ్చి ఒంగోలు నగరంలో అనధికారికంగా చెత్త సేకరణ చేపట్టినట్టు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 25కు పైగా డివిజన్లలో ఈ ఆటోలను ఏర్పాటు చేసి ప్రతి ఇంటి నుంచి రూ.50 నుంచి రూ.100 వరకూ వసూలు చేయించే వారని తెలిసింది. ఆ వసూళ్ల దందా నేటికీ కొనసాగుతోందని సమాచారం. నగర పాలక సంస్థలో 87 వేలకు పైగా గృహాలు ఉండగా 50 వేలకు పైగా ఇళ్ల నుంచి ప్రైవేటు ఆటోలు చెత్తను సేకరించే పనిలో ఉన్నాయి. అంటే దాదాపు నెలకు రమారమి ప్రైవేటు ఆటోల ద్వారా రూ.30 లక్షలకు పైగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. నగరంలో ప్రైవేటు ఆటోలు చెత్త సేకరిస్తున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదంటే ఎవరికి పోవాల్సిన వాటాలు వారికి పోతున్నాయన్నది స్పష్టమవుతోంది.

నిర్దాక్షిణ్యంగా డ్వాక్రా మహిళల ట్రాక్టర్ల నిలిపివేత...

ఒంగోలు నగర మెప్మాలోని డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించే విషయంలో గ్రూపు సభ్యులకు చెందిన వాళ్లు కొంతమంది ట్రాక్టర్లు చెత్త సేకరించటానికి ఏర్పాటు చేసుకున్నారు. చాలా కాలంగా వారు టాక్టర్లను చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. పారిశుధ్య విభాగానికి చెందిన ముఖ్య అధికారిణి బలవంతంగా నాలుగు ట్రాక్టర్లను నిలిపివేసింది. దాంతో బాధితులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం లేదు. ట్రాక్టర్లకు సంబంధించి దాదాపు రూ.18 లక్షల వరకూ నగర పాలక సంస్థ బకాయి ఉన్నా కూడా వాళ్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండానే బలవంతంగా ట్రాక్టర్లను నిలిపేశారు. దాంతో డ్వాక్రా గ్రూపు మహిళలు ఉపాధి పోయి అల్లాడుతున్నారు. ఇదిలా ఉంటే తిరిగి అధికార పార్టీ నాయకులు చెప్పిన వారి ట్రాక్టర్లను నూతనంగా చెత్త సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

చిన్నోడైనా...చితక్కొట్టాడు

- అండర్ 16లో ట్రిపుల్ సెంచరీ సాధించిన పృథ్వీరాజ్
- వాటిలో 61 బౌండరీలతో పరుగుల వరద
- అభినందనలు తెలిపిన ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్

ట్రిపుల్ సెంచరీ సాధించిన పృథ్వీరాజ్

కందుకూరు రూరల్: వయసుచిన్నదైనా.. వచ్చిన బాళ్లను వచ్చినట్లు చితక్కొడుతూ ట్రిపుల్ సెంచరీ బాదేశాడా చిచ్చరపిడుగు. అండర్ 16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు కృష్ణాజిల్లా మూలపాడులో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లాపై ప్రకాశం జట్టులోని ఎంఎల్ పృథ్వీరాజ్ అద్భుత ప్రతిభ చూపించాడు. కందుకూరు మండలంలోని కొండముడుసుపాలెం గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ అండర్ 16 విభాగంలో ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికై సెంట్రల్ జోన్ పోటీల్లో పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రకాశం జిల్లా జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 508 పరుగుల వద్ద డిక్లేర్ చేశారు. ప్రకాశం జిల్లా జట్టులోని ఎంఎల్ పృథ్వీరాజ్ రికార్డు స్థాయిలో 317 పరుగులు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో 61 బౌండరీలు ఉండటం విశేషం. దీనికి ముందు కృష్ణా జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో కూడా 19 ఫోర్స్, 1 సిక్సర్ తో 122 పరుగులు, బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టి ప్రకాశంజిల్లా టీంకు మంచి ఆల్ రౌండర్‌గా నిలిచాడు. దీనిపై ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు, అధ్యక్షుడు పోతుల నవీన్, పృథ్వీరాజ్ తండ్రి రాజాతో పాటు, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: మండల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓట్ల మార్పులు, చేర్పులపై అప్రమత్తంగా ఉండాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ నాయకులు, బూత్ కన్వీనర్‌లకు సూచించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ప్రక్రియలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నే అవకాశం ఉందన్నారు. పార్టీకి చెందిన ఓట్లు కోల్పోకుండా ప్రతి ఒక్క కార్యకర్త జాగ్రత్త తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజంట్లు తప్పని సరిగా కార్యక్రమంలో నిమగ్నం కావాలని కోరారు. ఓటు హక్కు కలిగిన వారికి సంబంధించిన ఫారాలను భర్తీ చేసి అందజేయటం, ఓటు హక్కు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలాంటి ఆధారాలు సమర్పించాలనే విషయాలపై ఓటర్ల వద్దకే వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఓట్లలో లోపాలను సరిదిద్ది బీఎల్ఓలకు సమర్పించేలా అందరూ పని చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాలకు బీఎల్ఓలు వచ్చినప్పుడు పార్టీ నాయకులు వారి వెంట ఉండి ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. నెల రోజుల పాటు ప్రక్రియ జరుతుంది కాబట్టి ఏ ఒక్క ఓటు రద్దు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవటంతో టీడీపీపై ప్రజలు ఆగ్రహంలో ఉన్నారన్నారు. ఈ ప్రక్రియలో పొరబాటున ఒక్క ఓటు తొలగిపోతే మళ్లీ చేర్చేందుకు ఎంతో సమయం పడుతుందని అన్నారు. ఇంటి వద్దకు బీఎల్ఓలు వస్తే ఇంట్లోని పేర్లను సరి చూసుకొని వారి వద్ద నుంచి రసీదు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు పత్తి రవిచంద్ర మొబైల్ యాప్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు చిట్టె వెంకటేశ్వరరెడ్డి, గుమ్మాయలేష్, గంటా గురవారెడ్డి, దూదేకుల రసూల్, బొగ్గరపు రమేష్, ఒంటేరు నాగేశ్వరరావు, చిట్యాల యోగయ్య, గుండా రెడ్డి రమణారెడ్డిలతో పాటు మండలానికి చెందిన ముఖ్య నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

- 2.350 కేజీల గంజాయి స్వాధీనం
- గంజాయి కేసులో ప్రతి నిందితున్ని అరెస్టు చేస్తాం
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు: గంజాయి సరఫరాకు సంబంధించిన కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సీహెచ్‌పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు ప్రాంతంలో గంజాయి విక్రయాలు, సరఫరా, రవాణాకు సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి జైల్‌కు పంపామన్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఈ కేసులో కీలక నిందితులను వరుసగా అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్న పట్టణంలోని బండపాలెంకు చెందిన కత్తుల కిశోర్, గుడ్లూరు గ్రామానికి చెందిన కామంచి రాజేష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిద్దరూ గంజాయి సరఫరాలో కీలక నిందితులుగా ఉన్నారని, కందుకూరు ప్రాంతంలో ప్యాకెట్లుగా గంజాయి విక్రయించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొంత కాలంగా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వీరిపై ప్రత్యేక నిఘా ఉంచి అదుపులోనికి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 2.350కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే ఈ కేసులో మరికొంత మంది నిందితుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుందని తెలిపారు. గంజాయి విక్రయించే వారు, తాగుతున్న వారి వివరాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే కందుకూరు పోలీస్ అధికారులు 9121102202, 9121102203 నంబర్లకు, 9121102266 అనే వాట్సప్ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీఐ షేక్ అన్వర్‌బాష, రూరల్ ఎస్సై బాలక్రిష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఒంగోలు సబర్బన్: వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేలా చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ రూపొందించిన బ్రోచర్‌ను కలెక్టర్ పి.రాజాబాబు ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్రోచర్‌కు సంబంధించిన వివరాలను కూడా కలెక్టర్ వివరించారు. అనంతరం రూడ్ సెట్ ద్వారా అమలవుతున్న శిక్షణ కార్యక్రమాల వివరాలతో బ్రోచర్‌ను కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమేష్, నాబార్డు అధికారి రవికుమార్, ఆర్‌బీఐ ఏజీఎం కిషన్ కుమార్, డీఆర్‌డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రగతికి పాటుపడాలి

- వీఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ రాజా బాబు

ఒంగోలు సబర్బన్: జవహర్ నవోదయ విద్యాలయ ప్రగతి కోసం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని, ప్రతి ఒక్కరూ నవోదయ కోసం పాటుపడాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆకాంక్షించారు. ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం మేనేజ్‌మెంట్ కమిటీ (వీఎంసీ) సమావేశం మంగళవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, విద్యాలయ కమిటీ చైర్మన్ పి.రాజాబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రగతి గురించి గత సంవత్సరంలో 10వ తరగతి, 12 తరగతుల్లో సాధించిన ఫలితాల గురించి, విద్యాలయంలో క్రీడలు, పురోభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు గురించి పలు అంశాలను నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ సి.శివరాం కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ ఎ.రఘు, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఒంగోలు ఆర్‌డీఓ చంద్రశేఖర్ నాయుడు, జిల్లా విద్యాధికారి రేణుక, జిల్లా వైద్య అధికారి డాక్టర్ సి.వెంకటేశ్వర్లు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, విద్యా అభివృద్ధి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ధనవంతుల కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం

జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

ఒంగోలు టౌన్: చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరుపేదల పొట్టలు కొట్టి ధనవంతుల కొమ్ము కాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయ్‌కుమార్ విమర్శించారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ...షెడ్యూల్ పరిశ్రమల్లోని 71 రంగాల్లో వేతనాలు సవరించుకోవడంతో కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలు కారుచౌకగా దోచుకుంటున్నారని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో వేతనాలు పెంచినా మన రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం వేతనాలు పెంచడం లేదని ధ్వజమెత్తారు. ఈ మధ్య కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు నూరుశాతం పెరిగాయని, కుటుంబ వ్యయం విపరీతంగా పెరిగిందని చెప్పారు. గ్రానైట్, ఆక్వా, స్పిన్నింగ్ మిల్లులు, రైస్, ఆయిల్ మిల్లులు, గోడౌన్లు, షాపింగ్ మాల్స్, హాస్పిటళ్లు, పెట్రోలు పంపుల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెట్రోలు, గ్యాస్ ధరలు పెరగడంతో పేదల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. వలస కార్మికులకు నివాస వసతులు కల్పించకపోవడంతో పశువుల కొట్టాల వంటి చిన్న చిన్న నివాసాలలో బతుకీడుస్తున్నారని తెలిపారు. రోజుకు 14 గంటలు పని చేస్తున్నా ఓటీ అమలు చేయడంలేదని, స్కీమ్ వర్కర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఎండీఎం, వీఓఏలకు వేతనాలు పెంచకుండా ప్రభుత్వాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీఎం కార్మికులకు రూ.3 వేల వేతనాలు ఇస్తూ జీవించే హక్కును ప్రభుత్వమే కాలరాస్తుందని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 10 ఏళ్ల సర్వీసు ఉంటే రెగ్యులర్ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చినా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులంతా జూలైలో జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జీవీ కొండారెడ్డి, పి.కల్పన, మంజుదార్, పి.ఆంజనేయులు, జి.రమేష్, వెంకటేశ్వర్లు, టి.రాము, ఆదిలక్ష్మి, చిరంజీవి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్పెస్ట్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్, 3వ అంతస్తు, కె.ఎఫ్.సి. సూర్యప్రకాష్ స్క్వేర్ అప్‌స్టెయిర్, గురునానక్ నగర్ రోడ్, ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ-520 008, ఆం.ప్ర. ఫోన్ : 0866-2546922

అధీకృత అధికారి వివరాలు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం : 81217 65159, ఆస్తి తనిఖీ కొరకు : 77082 27771

ఇ-వేలం అమ్మకం ప్రకటన

రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002. (సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద బ్యాంక్‌కు చార్జ్ చేసిన స్థిరాస్తుల అమ్మకం)

SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(4) క్రింద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ బకాయిలు రాబట్టుకొనుటకొరకు దిగువ తెలిపిన చార్జ్ చేయబడిన ఆస్తి ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అది మరియు ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదికన మరియు దిగువ తెలిపిన నియమనిబంధనలపై ఇ-వేలం (SARFAESI యాక్ట్, 2002 క్రింద) చేయబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా : 1) M/s. SK ఎక్స్‌పోర్ట్స్, భాగస్వామ్య సంస్థ, సర్వే నెం. 252/2ఎ, ఉప్పలపాడు గ్రామం, పొదిలి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523 253, 2) శ్రీమతి గురక వెంకట నరసమ్మ, మేనేజింగ్ పార్టనర్, భర్త : కోటేశ్వరరావు, ఉప్పలపాడు గ్రామం పొదిలి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523 253, 3) శ్రీమతి షేక్ కరిష్మా, పార్టనర్, భర్త : కౌసర్ అలీ, డి.నెం.15/1173-2, నంజీవ్‌నగర్, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్-515 411, 22-06-2026 నాటికి బకాయి మొత్తం : రూ. 44,18,984/- + తదుపరి వడ్డీ మరియు వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొ॥వి.

స్థిర ఆస్తి / ఆస్తుల వివరణ

రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4897/2017, తేది. 21-12-2017 ప్రకారం ఉప్పలపాడు గ్రామ పంచాయితీ, పొదిలి మండలం, పొదిలి SRO వద్ద గల మా ద్వారా ఫైనాన్స్ చేయబడిన అక్కడ గల ప్లాంట్ మరియు మెషినరీతో పాటు రూఫ్ షెడ్ మరియు సిసి. రూఫ్ గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణంతో పాటు సర్వే నెం. 252/2ఎ వద్ద గల సైట్‌లో ఎ. 0-47 1/2 విస్తీర్ణం గల ఆస్తి యావత్తు. షెడ్యూల్ ఆస్తి M/s. SK ఎక్స్‌పోర్ట్స్, ఉప్పలపాడు, మేనేజింగ్ పార్టనర్ : శ్రీమతి గురక వెంకట నరసమ్మ, భర్త : కోటేశ్వరరావు, మరియు శ్రీమతి షేక్ కరిష్మా, భర్త : కౌసర్ అలీకి చెందినది. సరిహద్దులు : ఉత్తరం : కాకర్లరోడ్, దక్షిణం : పొదిలి యలమంద మరియు ఇతరుల భూమి, పశ్చిమం : గురక గురవయ్య భూమి, ఉత్తరం : జూచి యల్లమందారెడ్డి భూమి.

రిజర్వు ధర : రూ. 69,00,000/- ఐయానా : రూ. 6,90,000/- బిడ్ గుణాంక మొత్తం : రూ. 10,000/-

ఇ-వేలం తేది : 29-07-2026 సమయం : ఉదయం 11.00 గం॥ నుండి సాయంత్రం : 4.00 గం॥

ఆస్తి తనిఖా తేదీ మరియు సమయం : 24-06-2026 నుండి 28-07-2026 వరకు ఉ. 10.00 నుండి సా. 4.00 గం.వరకు

ఇ-వేలం యొక్క నియమనిబంధనలు దిగువ విధంగా ఉన్నాయి.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ